# విద్యాభివృద్ధికి పెద్దపీట



ప్రభుత్వ కళాశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు

- అదనపు గదుల నిర్మాణంతో విద్యార్థులకు కలిగిన సౌకర్యం

దహెగాం, డిసెంబర్ 5 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తూ మెరుగైన విద్యను అందించింది. దహెగాం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 103, ద్వితీయ సంవత్సరం 107 మంది మొత్తం 207 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సమైక్య పాలనలో తగినంత గదులు లేక సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని తరగతి గదుల్లో విద్యార్థులు విద్యాబోధన సాగించేవారు. కానీ స్వరాష్ట్రంలో పరిస్థితి మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.60 లక్షలతో కళాశాలలో మరో మూడు అదనపు గదులు నిర్మించారు. ఆ గదులను అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించారు. దీంతో విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా మారడంతో ప్రస్తుతం ఆ గదుల్లో విద్యాబోధన సాగుతుంది. సౌకర్యాలతో ప్రైవేట్‌కు ధీటుగా కళాశాల ముందుకు సాగింది. విద్యార్థులు కూడ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఉన్నత విద్యకు వెళ్తున్నారు.



కళాశాల అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప(ఫైల్)

### అప్పటి ఎమ్మెల్యే సహకారంతోనే..



మా కళాశాలకు గదుల సమస్య చాలా ఉండేది. ఒక సారి అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కళాశాలకు వచ్చినప్పుడు మా ప్రిన్సిపాల్ సార్ సమస్యను దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నిధులు కేటాయించి మూడు గదులు కట్టించారు. దీంతో మాకు గదుల కొరత తీరింది. ఇప్పుడు చాలా సౌకర్యంగా ఉంది.

-దబ్బిటి హరికృష్ణ, సీఈసీ ద్వితీయ సంవత్సరం

### సమస్య తీరింది



మా కళాశాలలో ఇంతకుముందు తరగతి గదుల సమస్య ఉండేది. ఇప్పుడు ఆ సమస్య తీరింది. అదనంగా మూడు గదులు నిర్మించడంతో సౌకర్యంగా ఉంది. ఇంతకు ముందు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో తరగతులు నిర్వహించడంతో చాలా ఇబ్బందిగా ఉండేది. గదులు లేక పరీక్షలు కూడ పాఠశాలలోనే రాయించే వారు. ఇక నుంచి కళాశాలలోనే పరీక్ష సెంటర్ ఏర్పాటు చేస్తారు. మాకు తరగతి గదుల సమస్య తీరింది.

-దాన్నూరి నవీన్, సీఈసీ, మొదటి సంవత్సరం

## ప్రేమ్‌సింగ్ మహారాజ్‌కు సన్మానం




ప్రేమ్‌సింగ్ మహారాజ్‌ను సన్మానిస్తున్న జడ్పీటీసీ అజయ్‌కుమార్

వాంకిడి, డిసెంబర్ 5 : మండలంలోని పిప్పర్‌గొంది గ్రామంలో మంగళవారం వాంకిడి జడ్పీటీసీ అజయ్ కుమార్ లంబాడీల ఆరాధ్య దైవమైన జై సేవాలాల్ మహారాజ్ శిష్యుడు ప్రేమ్ సింగ్ మహారాజ్‌ను దర్శించుకొని శాలువాతో సన్మానించారు. మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణచారి, నాందేవ్, జైసేవా లాల్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జొన్న సాగు లాభాలు బాగు

వాంకిడి, డిసెంబర్ 5 : మండలంలో జొన్న సాగు పెరిగింది. ఇతర పంటలకు అధిక పెట్టుబడితో పాటు చీడపీడలు ఉండడంతో ఆశించిన దిగుబడి రావడం లేదు. దీంతో లాభాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మండలంలోని రైతులు ఈ సారి ఎక్కువగా జొన్న సాగుపై మొగ్గు చూపారు. జొన్నలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో లాభాలు బాగుంటాయని రైతులు అంటున్నారు.



వాంకిడి మండలంలో సాగు చేస్తున్న జొన్న

## రైతులు జాగ్రత్త

దహెగాం, డిసెంబర్ 5: వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రెండు రోజల నుంచి మబ్బుగా ఉంటూ అక్కడక్కడ వర్షం కురుస్తుండడంతో కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా కుప్పలుగా పోసి వాటిపై తాటిపత్రులను కప్పి ఉంచారు. మరి కొందరు రైతుల వరి పంటను కోయలేదు వర్షం కురిస్తే చేతికి వచ్చే సమయంలో నష్టం జరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

# ముమ్మరంగా వరి కోతలు



నంబాలలో వరి కోస్తున్న యంత్రం

రెబ్బెన, డిసెంబర్ 5 : మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పలు గ్రామాల్లో చెరువుల కింద వరి కోతకు రావడంతో రైతులు యంత్రాలను ఆశ్రయించి కోతలు చేయిస్తున్నారు. తుఫాన్ కారణంగా మబ్బులు పట్టి ఉండడంతో పాటు చిరుజల్లులు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం ఒక చోట ఉంచి వాటిపై వర్షానికి తడవకుండా కవర్లు కప్పుతున్నారు. చిరుజల్లులు కురుస్తుండడంతో వరి కోతకు అంతరాయం కలుగుతుందని దీని వల్ల యంత్రానికి కిరాయి పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఎత్తివేత

వాంకిడి, డిసెంబర్ 5 : మండల కేంద్రం సరిహద్దులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఎత్తివేసినట్లు వాంకిడి ఎస్ఐ సాగర్ మంగళవారం తెలిపారు. శాసనసభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దు గుండా మద్యం, డబ్బు రవాణా చేయకుండా అక్టోబర్ 20వ తేదీన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టును ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీలు చేపట్టారు. నవంబర్ 30వ తేదీన శాసనసభ ఎన్నికలు ముగియడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్‌పోస్టును ఎత్తివేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వాంకిడి, డిసెంబర్ 5 : మండలంలోని చిన్న బెండార సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సామెల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దేవుల్ల బాపు(55) మృతి చెందాడు. వాంకిడి ఎస్ఐ సాగర్ వివరాల ప్రకారం.. బాపుబెండార నుంచి సామెల వైపు బైక్‌పై వస్తున్న క్రమంలో చిన్నబెండార సమీపంలో ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బాపుకు గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

## వాతావరణంలో మార్పులు.. ఆందోళనలో రైతులు

వాంకిడి, డిసెంబర్ 5 : బంగాళఖాతంలో ఏర్పడిన 'మిగ్‌జాం' తుఫాన్ తీవ్రరూపం దాల్చడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. రెండు రోజుల నుంచి మేఘాలు కమ్ముకోగా వాతావరణమంతా చల్లగా మారిపోయింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మిగ్‌జాం తుఫాన్ కారణంగా చిరుజల్లులు కురవడంతో కొతదశలో ఉన్న పంటలు పత్తి, ధాన్యం తడిసి పోతుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పగట్టి టార్పాలిన్లతో కప్పి ఉంచారు. కోత దశలో ఉన్న పంటలు కోసేందుకు ఇబ్బందులు తలెత్తే ఆవకాశం ఉందని మండల రైతులు ఆందోళన చెందుతున్నారు.

## గిరి గ్రామాల్లో వైద్య శిబిరం



కోకగూడలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

జైనూర్ సెప్టెంబరు 5 : మండలంలోని ఉషేగావ్ పీహెచ్‌సీ పరిధిలోని టింకాపల్లి, కోకాగూడ గ్రామాల్లో వైద్యులు మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పలు వ్యాధులకు రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రమేశ్, గణేశ్, హెచ్‌ఏ జమ్ము, జంగు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ కౌటిల్య

తిర్యాణి, డిసెంబర్ 5 : విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్‌బీఎస్‌కే డాక్టర్ కౌటిల్య ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మండలంలోని చౌపన్‌గూడ, చెలిమెల, దేవాయిగూడ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు సాధారణ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టు పద్మావతి, ఏఎన్ఎం రూప, అంగన్‌వాడీ, ఆశ, ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.